# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 58 | శుక్రవారం 31, అక్టోబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



MHR TV




## 4.47లక్షల ఎకరాల్లో
# పంటనష్టం

### అధికారులు ప్రాథమిక అంచనా

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆయా జిల్లాల్లో పొలాల్లోనే నేలకొరిగిన వరి
- వరంగల్, సూర్యాపేట, ఖమ్మం,సిద్దిపేట, హనుమకొండ, నల్గొండ జిల్లాల్లో అధికం
- పత్తి అధికంగా పండించే ఆదిలాబాద్‌లో వర్ష ప్రభావం తక్కువ ఉండడంతో తగ్గిన నష్టం
- నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం**

మొంథా తుఫాన్ రైతులను నిండా ముంచింది. రెండురోజులపాటు కురువడంతో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, వేరుశనగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 179 మండలాల్లో 2,53,033 మంది రైతులకు చెందిన 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్రభుత్వానికి నష్టనివేదికను అందజేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేస్తే పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, హనుమకొండ, నల్లగొండ జిల్లాలో భారీగా పంటనష్టం జరిగింది. రాష్ట్రంలో తుఫాన్ కారణంగా 2,82,379 ఎకరాల్లో వరిపంట నష్టం జరిగినట్లు అధికారుల

..మిగతా 2లో

# నా చివరి కోరిక ఇదే



- బీసీలకు రాజ్యాధికారం దక్కాలన్నదే తన చివరి ఆకాంక్ష అన్న ఆర్. కృష్ణయ్య
- బీసీ బంద్ సందర్భంగా 350 మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపణ
- తెలంగాణ నుంచే బీసీ ఉద్యమం ప్రారంభమైందని వెల్లడి

02

# నేడు సీఎం ఏరియల్ సర్వే

- ధాన్యం తడవకుండా చూడాలి
- రైతుల్లో ఆందోళన నెలకొన్నది
- 16 జిల్లాల్లో తుఫాను ప్రభావం
- 24 గంటల కమాండ్ కంట్రోల్ రూమ్
- సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్



02

### హరీశ్ రావు ఇంటికి
# కవిత

- హరీశ్ తండ్రి మృతి పట్ల కుటుంబానికి సంతాపం
- అంత్యక్రియలకు గైర్హాజరు కావడంతో రేగిన ఊహాగానాలు
- గతంలో కాళేశ్వరంపై హరీశ్‌ను టార్గెట్ చేసిన కవిత



02

### జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే
# గ్యారెంటీలు అమలు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ట్విట్టర్ దాడి
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపు
- ఉపఎన్నికల కోసమే కాంగ్రెస్ ఆపదమొక్కులు మొక్కుతోందని విమర్శ



**తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారానే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు

..మిగతా 2లో



03

### అజారుద్దీన్
# దేశద్రోహి!

- ఆయనపై ఉన్నవి సాదాసీదా కేసులు కాదు
- దేశ గౌరవాన్ని ఆయన తగ్గించారు
- అలాంటి వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వడమేంటి?
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యల

# బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ
- ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని ధీమా
- ఓట్ల కోసం మోదీ ఏ డ్రామా అయినా ఆడతారన్న రాహుల్ గాంధీ
- మహారాష్ట్ర, హర్యానా లాగే బీహార్‌లో ఓట్లు దొంగిలిస్తారని ఆరోపణ
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పోలింగ



03

### మంత్రివర్గ విస్తరణపై ఈసీకి
# బీజేపీ ఫిర్యాదు

- ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అజర్ కు మంత్రి పదవి
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రభావితమయ్యే చాన్స్
- ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
- బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్
- ఎన్నికల కోడ్ ఉండగా మంత్రివర్గ విస్తరణ చేయొద్దనే రూలేం లేదు
- కానీ అజర్ ను కేబినెట్ లో తీసుకోవడం ఆక్షేపణీయ
- మర్రి శశిధర్ రెడ్డి



**తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల నియామావళిని ఉల్లంఘించి అజారుద్దీన్ కు మంత్రి పదవి కట్టబెడుతున్నారని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ విమర్శలు చేశారు. ఈనేపథ్యంలో హైదరాబాద్ లో బీఆర్కేఆర్ భవన్ లో ఎలక్షన్ కమిషన్ అధికారులకు గురువారం ఆయన పార్టీ నేతలతో కలిసి ఫిర్యాదుచేశారు. అనంతరం శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడమంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో

..మిగతా 2లో



# మైనార్టీ వర్గాలపై బీజేపీ వివక్ష

- అజారుద్దీన్ మన దేశ, రాష్ట్ర కీర్తిపతాకాలను రెపరెపలాడించిన వ్యక్తి
- మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖలు రాయడమేమిటని ఆగ్రహం
- ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సహకరించేందుకే బీజేపీ లేఖ రాసిందని ఆరోపణ

02



# నేడు సీఎం ఏరియల్ సర్వే

- ధాన్యం తడవకుండా చూడాలి
- రైతుల్లో ఆందోళన నెలకొన్నది
- 16 జిల్లాల్లో తుఫాను ప్రభావం
- 24 గంటల కమాండ్ కంట్రోల్ రూమ్
- సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. వరంగల్, హుస్నాబాద్ లో భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, పంట నష్టం వాటిల్లిన ప్రాంతాలను సీఎం పరిశీలిస్తారు. గురువారం ఉదయమే వరద ప్రభావిత జిల్లాలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి సిద్ధపడ్డా...ఆఖరి నిమిషంలో సీఎం పర్యటన రద్దయింది. వాతావరణం అనుకూలించకపోవటంతో హెలికాప్టర్ ప్రయాణం వీలు కాదని ఏరియల్ సర్వేకు అధికారులు అనుమతించలేదు. ఇక తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని,పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు.తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు. విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో పాటు తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కళ్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్ఛార్జి అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్ఛార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. విధాన పరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవిన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని నివేదించారు. తుఫాను, వర్షాల ప్రభావమున్న జిల్లాల్లో చేపడుతున్న సహాయక చర్యలు, రోడ్లు, రహదారుల పునరుద్ధరణ చర్యలు ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సమీక్షించాలని సీఎం కోరారు. తమ సొంత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ఇన్ఛార్జీగా ఉన్న జిల్లాల్లో ప్రజలను ఆదుకునే చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చెప్పారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు.

ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాలతో ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు. రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సీఐ, రెవిన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు.హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 9 రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేసి రెండు వేల మందిని వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ సెల్ను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి వర్షాలు, వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

# 4.47లక్షల ఎకరాల్లో పంటనష్టం

మొదటిపేజీ తరువాయి

ప్రాథమిక అంచనా వేశారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో 70,700 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలోని 16 మండలాల్లో 48444 ఎకరాలు, ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో 36893 ఎకరాలు, హనుమకొండ జిల్లాలోని14 మండలాల్లో 33348 ఎకరాలు, నల్లగొండ జిల్లాలోని 22 మండలాల్లో 28055 ఎకరాలు, నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 10585 ఎకరాలు, మహబూబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 16617 ఎకరాలు, జనగాం జిల్లాలోని 12 మండలాల్లో 18320 ఎకరాలు, కరీంనగర్ జిల్లాలోని 15 మండలాల్లో 15987 ఎకరాలు, సిద్దిపేట జిల్లాలోని 10 మండలాల్లో 1583 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 8 మండలాల్లో 1178 ఎకరాలు, మహబూబ్ నగర్ జిల్లాలోని 10 మండలాల్లో 668 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.



పత్తి రాష్ట్ర వ్యాప్తంగా 1,51,707 ఎకరాల్లో నష్టం జరుగగా, వరంగల్ జిల్లాలో 55వేల ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 23911 ఎకరాలు, ఖమ్మంలో 22574 ఎకరాలు, నాగర్ కర్నూల్ జిల్లాలో 18647 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మొక్క జొన్న 4963 ఎకరాలు, మిర్చి 3613 ఎకరాలు, పప్పుధాన్యాల పంట 1228 ఎకరాలు, వేరుశనగా 2674, ఇతర హార్టికల్చర్ పంటలు 1300 ఎకరాల్లో నష్టం జరిగింది. పంట నష్టం ఎక్కువగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగింది. 1,30,200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా ,తరువాత స్థానంలో ఖమ్మం జిల్లా 62,400 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 56330 ఎకరాలు, నల్గొండ జిల్లాలో 52,071 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలో తెలిపారు.

### నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

**మంత్రి తుమ్మల**

మొంథా తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. వరద ప్రభావిత జిల్లాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తారని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. ఎకరాకు ఎంత పంట నష్ట పరిహారం ఇవ్వాలో సీఎం తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటామని వెల్లడించారు.

# మంత్రివర్గ విస్తరణపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి

ఒక వర్గాన్ని ప్రభావితం చేయడమేనని పేర్కొన్నారు. ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకోవాలని కోరామని వెల్లడించారు. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఎన్నిక తర్వాత మంత్రివర్గ విస్తరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నపళంగా మంత్రివర్గ విస్తరణ చేయడం, అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం వెనుకున్న ఆంతర్యమేంటని శంకర్ ప్రశ్నించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో ఫసల్ బీమా పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శలు చేశారు. ఫసల్ బీమా అమలు చేస్తే నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతాంగం ఆగమైందని, తక్షణమే నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం బేషరతుగా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే లీగల్ గా ముందుకు వెళ్తామని పాయల్ శంకర్ హెచ్చరించారు. మంత్రులు తిరగాల్సింది జూబ్లీహిల్స్ లో కాదని, నష్టపోయిన ప్రతి జిల్లాల్లో తిరగాలని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ మంత్రివర్గ విస్తరణ చేయొద్దనే రూల్ ఎక్కడా లేదని, కానీ గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి జూబ్లీహిల్స్ అభ్యర్థిగా పోటీ చేసిన అజారుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ఆక్షేపణీయమని విమర్శలు చేశారు. ఆ వర్గానికి గతంలో ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదని ప్రశ్నించారు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోందన్నారు. సినీ కార్మికులను ప్రభావితం చేసేలా ప్రకటనలు చేయడం సరికాదని, ఆ కార్యక్రమానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# మైనార్టీ వర్గాలపై బీజేపీ వివక్ష

- అజారుద్దీన్ మన దేశ, రాష్ట్ర కీర్తిపతాకాలను రెపరెపలాడించిన వ్యక్తి మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖలు రాయడమేమిటని ఆగ్రహం
- ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సహకరించేందుకే బీజేపీ లేఖ రాసిందని ఆరోపణ

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం

మైనార్టీ వర్గాలపై బీజేపీ వివక్ష చూపుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గురువారం ఆయన గాంధీభవన్ లో మాట్లాడుతూ...మహమ్మద్ అజారుద్దీన్ ను రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసుకోకుండా బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. అజారుద్దీన్ దేశ క్రికెట్ జట్టుకు సుధీర్ఘ కాలం కెప్టెన్ గా వ్యవహరించారని, క్రికెట్ లో దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. దేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన క్రీడాకారుల్లో అజారుద్దీన్ ఒకరు అని వెల్లడించారు. అజారుద్దీన్ లాంటి విఖ్యాత క్రీడాకారుడికి మంత్రి వర్గంలో అవకాశం కల్పిస్తుంటే బీజేపీ అడ్డుకుంటోందన్నారు. అజారుద్దీన్ పైన బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ తెర వెనుక బంధం గురించి ఇప్పటికే కల్వకుంట్ల కవిత స్పష్టం చేసిందని గుర్తు చేశారు. గతం లో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ ఎస్ సహకారం తో నే బీజేపీ రాష్టం లో 8 సీట్లు గెలుచుకుందన్నారు. జూబ్లీ హిల్స్ లో తమకు గెలిచే అవకాశం లేదని బీజేపీ కి తెలుసు అన్నారు. అందుకే బీఆర్ ఎస్ కు లాభం చేయడం కోసం చాలా లేట్ గా బలహీనమైన అభ్యర్థి ని బీజేపీ ప్రకటించిందన్నారు. అజారుద్దీన్ తో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్ర గవర్నర్ పైన బీజేపీ ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం ఉన్నదన్నారు. ఇక కుట్రలో భాగంగానే ఎన్నికల కమిషన్ కు బీజేపీ ఫిర్యాదు చేసిందన్నారు.



# నా చివరి కోరిక ఇదే

- బీసీలకు రాజ్యాధికారం దక్కాలన్నదే తన చివరి ఆకాంక్ష అన్న ఆర్. కృష్ణయ్య
- బీసీ బంద్ సందర్భంగా 350 మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపణ
- తెలంగాణ నుంచే బీసీ ఉద్యమం ప్రారంభమైందని వెల్లడి

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం



బీసీలకు రాజ్యాధికారం కల్పించడమే తన జీవితంలో చివరి కోరిక అని బీసీ సంఘాల నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని, ఈ ఉద్యమం తెలంగాణ నుంచే ప్రారంభమైందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల నిర్వహించిన 'బీసీ బంద్' సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 350 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆర్. కృష్ణయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. బీసీల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న వారిని అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా తన నాయకత్వంలో బీసీ జేఏసీని ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ లక్ష్యం నెరవేరేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని కృష్ణయ్య అభిప్రాయపడ్డారు.

# హరీశ్ రావు ఇంటికి కవిత

- హరీశ్ తండ్రి మృతి పట్ల కుటుంబానికి సంతాపం
- అంత్యక్రియలకు గైర్హాజరు కావడంతో రేగిన ఊహాగానాలు
- గతంలో కాళేశ్వరంపై హరీశ్ ను టార్గెట్ చేసిన కవిత

తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి హరీశ్ రావును పరామర్శించారు. హరీశ్ రావు తండ్రి సత్యనారాయణరావు రెండు రోజుల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. ఈరోజు హరీశ్ ఇంటికి వెళ్లిన కవిత, ఆయన కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేసి, కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అయితే, ఈ పరామర్శకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. సత్యనారాయణరావు అంత్యక్రియలకు కవిత హాజరుకాలేదు. దీంతో హరీశ్ తో ఆమెకు ఉన్న విభేదాల కారణంగానే రాలేదంటూ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో, మూడు రోజుల తర్వాత కవిత స్వయంగా హరీశ్ ఇంటికి వెళ్లి పరామర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో కవిత... హరీశ్ పై తీవ్రమైన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై హరీశ్ నేరుగా స్పందించకపోయినా, తన ప్రస్థానం తెరిచిన పుస్తకం అంటూ పరోక్షంగా సమాధానమిచ్చారు. ఆ వివాదం తర్వాత హరీశ్ ఇంటికి కవిత వెళ్లడం ఇదే మొదటిసారి.

# జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలు

మొదటిపేజీ తరువాయి

ఆయన వరుస ట్వీట్లు చేశారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చిత్తుగా ఓడించాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అలాంటి ఓటమి రుచి చూస్తేనే అధికార పార్టీకి భయం పట్టుకుంటుందని, అప్పుడే పెండింగ్‌లో ఉన్న హామీల అమలుపై దృష్టి పెడుతుందని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయి వాస్తవాలు అర్థమవుతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు.

ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 'ఆపదమొక్కులు' మొక్కుతోందని కేటీఆర్ విమర్శించారు. పార్టీ పరువు కాపాడుకోవడం కోసమే రకరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సినీ కార్మికులకు కొత్త వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోనుండడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేనంత హడావుడిగా హైదరాబాద్ వీధుల్లో తిరగడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని కేటీఆర్ తెలిపారు. ఈ ఉపఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబితేనే, రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



# అజారుద్దీన్ దేశద్రోహి!

- ఆయనపై ఉన్నవి సాదాసీదా కేసులు కాదు
- దేశ గౌరవాన్ని ఆయన తగ్గించారు
- అలాంటి వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వడమేంటి?
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**తెలంగాణబ్యూరో, ప్రజాస్వరం**

అజారుద్దీన్‌పై దేశద్రోహం కేసు ఉందని, అలాంటి వ్యక్తికి మంత్రి పదవి ఎలా ఇస్తారని, అది కూడా ఉప ఎన్నిక జరిగే సమయంలో ఎందుకు అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అజారుద్దీన్ క్రికెట్‌లో దేశానికి ఏం చేశారో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ఆయనపై ఉన్నవి సాదాసీదా కేసులు కాదని, దేశానికి ద్రోహం చేశారని ఆరోపించారు. అందుకే క్రికెట్‌లో లైఫ్ టైం బ్యాన్ విధించారన్నారు. ఆ కారణంగానే ఆయన్ను గత ఎన్నికల్లో ఓడించారని చురకలంటించారు. అలాంటి వ్యక్తి గవర్నర్ కోటా కింద మంత్రి పదవికి అర్హుడా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. దేశ గౌరవాన్ని అజారుద్దీన్ తగ్గించారని విమర్శలు చేశారు. అలాంటి వ్యక్తిని మంత్రిని చేయడానికి కాంగ్రెస్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. మరోవైపు, ఘట్ కేసర్ వద్ద గోరక్షకుడు సోనూ సింగ్‌పై ఎంఐఎం కార్యకర్త ఇబ్రహీం ఖురేషి హత్యా యత్నానికి పాల్పడిన వషయాన్ని గుర్తు చేశారు. పోలీసులు చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే అండగా ఉండాల్సిన వారు అక్రమ కేసులు పెట్టి బెదిరించారని మండిపడ్డారు. పదేండ్లలో స్లాటర్ హౌజ్‌లు ఎన్నడూ నిబంధనలు పాటించలేదన్నారు. బంగ్లాదేశ్ నుంచి దేశంలోకి చొరబడిన వారు పశువుల అక్రమ రవాణా వెనుక ఉన్నారని ఆరోపించారు. ఖురేషీపై దేశవ్యాప్తంగా ఎన్నో కేసులు ఉన్నాయని, అసద్‌కు అతను సన్నిహితుడని పేర్కొన్నారు. ఈ విషయంలో కొందరు కార్పొరేటర్లు పోలీస్ అధికారులను కూడా బెదిరిస్తున్నారని వివరించారు.

# బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ
- ముజఫర్‌పూర్, ఛప్రాలో రెండు బహిరంగ సభలు
- ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని ధీమా
- ఓట్ల కోసం మోదీ ఏ డ్రామా అయినా ఆడతారన్న రాహుల్ గాంధీ
- మహారాష్ట్ర, హర్యానా లాగే బీహార్‌లో ఓట్లు దొంగిలిస్తారని ఆరోపణ
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పోలింగ్

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీల అగ్రనేతల పర్యటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలలో రెండు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ బీహార్‌లో బీజేపీఎన్డీఏ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "బీహార్‌లోని నా కుటుంబ సభ్యులే ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం కోసం స్వయంగా బరిలోకి దిగారు. ఈ ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఉదయం 11 గంటలకు ముజఫర్‌పూర్‌లో, మధ్యాహ్నం 12:45 గంటలకు ఛప్రాలో ప్రజలతో సంభాషించే భాగ్యం నాకు కలుగుతుంది. రాష్ట్రంలోని నా సోదర సోదరీమణులు మరోసారి విజయ శంఖాన్ని పూరిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ముజఫర్‌పూర్‌లో జరిగిన మహాఘట్‌బంధన్ ఉమ్మడి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఆయనకు (మోదీకి) కేవలం మీ ఓటు మాత్రమే కావాలి. ఓట్ల కోసం డ్రామా చేయమంటే చేస్తారు. మీరేమైనా చేయించగలరు. నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమన్నా చేస్తారు" అంటూ రాహుల్ విమర్శించారు. "వారు మీ ఓట్లను దొంగిలించే పనిలో ఉన్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలను దొంగిలించారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే ప్రయత్నం చేస్తారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.



ఇదిలా ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బుధవారం బేగుసరాయ్, సమస్తిపూర్, దర్భంగాలలో ఎన్డీఏ తరపున ప్రచార ర్యాలీలు నిర్వహించారు. 2025 బీహార్ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య నెలకొంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ (రామ్ విలాస్) వంటి పార్టీలు ఉండగా, మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఉన్నాయి. వీటికి తోడు ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ కూడా రాష్ట్రంలోని 243 స్థానాల్లో పోటీ చేస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# పెబ్బేరు కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కలెక్టర్ ఆదేశాలు

- నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచన

**వనపర్తి,అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**

పెబ్బేరు మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆకస్మికంగా పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. నూతన ఆస్పత్రి నిర్మాణ స్థలాన్ని, మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. "ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే కొత్త భవన నిర్మాణం ఆలస్యం కాకుండా పూర్తవ్వాలి. పనులు శరవేగంగా చేయండి," అని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సమీప భవనాలకు తరలించి తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్య సేవలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, రోగులకు సమయానికి చికిత్స అందించాలన్నారు. డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలని, అలాగే టీబీ, డయాబెటిస్ స్క్రీనింగ్ వివరాలను హెల్త్ యాప్‌లో సమయానికి అప్డేట్ చేయాలని సూచించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కొత్త ఆస్పత్రి నిర్మాణం ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మండల ప్రజలకు పెద్ద సదుపాయం లభించనుంది అని అభిప్రాయపడ్డారు.





# విద్యార్థులు క్రమశిక్షణతో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- రెండు మూడు రోజుల్లో హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలి అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**

విద్యార్థులు నిత్యం క్రమశిక్షణ పాటిస్తూ ,కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉన్నత స్థాయికి చేరి, తర్వాతి తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ బోధన విధానాలు, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై అధ్యాపకులతో చర్చించారు. తరువాత హాస్టల్ భవనాన్ని పరిశీలించి, అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో హాస్టల్‌ను ప్రారంభించి విద్యార్థులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ సందర్భంగా కలెక్టర్ మొక్కను నాటారు. విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల చదువుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, కాబట్టి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు బాగా చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని అన్నారు. హాస్టల్ ప్రారంభం కావడం వల్ల విద్యార్థులకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్‌ను సిబ్బంది శాలువాతో సత్కరించి మొమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయచంద్ర,బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆంజనేయులు, మునిసిపల్ కమిషనర్,ఎంపీడీవో, ఇతర అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు.





# అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలి.
- 1000 కోట్లు తెచ్చి అభివృద్ధి ఎక్కడ చేశారో చూపండి.
- మెయింటెనెన్స్ పనులు చేస్తూ రోడ్ల వెడల్పు అంటే ఎలా.?
- దమ్ముంటే ఇండ్లు తొలగించి రోడ్ల వెడల్పు చేపట్టండి.
- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్.

**వనపర్తి ప్రతినిధి,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వనపర్తిలో చేపట్టిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌లు డిమాండ్ చేశారు. గురువారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతిసారి గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తమ ప్రభుత్వం లోనే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామని, 1000 కోట్లు నిధులు తెచ్చామని ఊకదంపుడు మాటలు చెప్పడం కంటే చేసి చూపించాలని సవాలు విసిరారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే నిధులు తెచ్చి అభివృద్ధి చేశామని కాంగ్రెస్ నాయకులు చెబుతుంటే ఒక టీవీ ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే మెగా రెడ్డి స్వయంగా మాట్లాడుతూ మునిసిపాలిటీలో జరిగే టియుఎఫ్ ఐడిసి, అమృత్ స్కీం టెండర్లు గత ప్రభుత్వంలోనే జరిగాయని చెబుతున్నారన్నారు. రోడ్ల వెడల్పు విషయంలో తాము గతంలో తహసిల్దార్ కార్యాలయం నుండి రామాలయం వరకు రోడ్లకు అడ్డంగా ఉన్న ఇండ్లను తొలగించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్లకు దమ్ముంటే తాసిల్దార్ కార్యాలయం నుండి పాలిటెక్నిక్ కళాశాల వరకు రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇండ్లను తొలగించి అభివృద్ధికి ఆజ్యం పోయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్ని నిధులు తెచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని లేదంటే మీరు పార్టీలు మారినంత మాత్రాన జీవోలు మారవని హితవు పలికారు.

# కాటం నారాయణరెడ్డి గుండెపోటుతో ఆకస్మిక మృతి

**పెద్దమందడి,అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**



మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాటం నారాయణరెడ్డి గురువారం గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం బిఆర్ఎస్ లో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు.కాగా గత కొన్నేళ్లుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ హైదరాబాదులో నివాసం ఉంటూ అక్కడే వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకునేవాడు. ఇదే క్రమంలో గురువారం నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్లగా ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో కలివిడిగా ఉంటూ పలకరించేవాడని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

# జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్

**ఖమ్మం,అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నవీన్ యాదవ్ గెలుపును కాంక్షిస్తూ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రి వాకిటి శ్రీహరి తో కలిసి ఓటు అభ్యర్థిస్తున్న వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ వారితోపాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు , మట్ట దయానంద్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు ఈ సందర్భంగా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయం తధ్యమని ఆ వాతావరణం ఎక్కడ కనిపిస్తుందని అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలా అయితే కట్టుబడి ఉందో అదే విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజా ఆదరణ మద్దతు మెండుగా ఉందని ఖచ్చితంగా మేము బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఆగదని కచ్చితంగా మేము గెలుస్తామని అదేవిధంగా ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించుకుంటూ ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు అదేవిధంగా ఈరోజు మేము కొన్ని హోటల్స్ లో మరియు ఇళ్ల దగ్గరికి వెళ్ళినప్పుడు వారి యొక్క ఆదరణ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుస్తాడని భరోసాని మాకు కల్పించారు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుస్తున్నాడని తెలియజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ప్లకార్డులు పట్టుకొని బ్రోచర్లు పంచుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించినారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంబించిన – వజ్రేష్ యాదవ్

**అలియాబాద్,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**



మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ తుర్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జిడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, భీమిడి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలకు స్వంత గృహాలను అందిస్తూ సామాజిక న్యాయాన్ని అమలు చేస్తోంది.ప్రతి నిరుపేద కుటుంబానికి గృహం కల్పించడం ప్రభుత్వ లక్ష్యం" అని పేర్కొన్నారు.



## మూడుచింతలపల్లి తహసీల్దార్ సుచరితను మర్యాదపూర్వంకంగా కలిసిన క్యాతం మధుకృష్ణ

**శామీర్ పేట అక్టోబర్ 30(ప్రజాస్వరం)**

మూడుచింతలపల్లి తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన సుచరిత గారికి శుభాకాంక్షలు తెలిపిన యువ నాయకుడు క్యాతం మధు క్రిష్ణ, ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న లక్ష్మాపూర్ గ్రామ ప్రజల రెవిన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ చారి, భాస్కర్ పాల్గొన్నారు.



## జిన్నారం సీఐని కలిసిన గుమ్మడిదల భాజపా మండల అధ్యక్షుడు

**గుమ్మడిదల అక్టోబర్ 30 (ప్రజాస్వరం)**

గుమ్మడిదల మండల భారతీయ జనతా పార్టీ ప్రెసిడెంట్ కావలి ఐలేష్ గురువారం నాడు మధ్యాహ్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జిన్నారం రమణారెడ్డిని మండల శాఖ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గుమ్మడిదల లక్ష్మీ కాంత్ రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ రాజు, మండల పద్ధతికారి ముత్యాల గౌడ్ జిన్నారం మండల సీనియర్ నాయకులు బిక్షపతి,నర్సింగరావు, భూత్ అధ్యక్షులు భాగయ్య గంగాగౌడ్ తదిరులు పాల్గొన్నారు.



## సత్యనారాయణ రావుకుఘన నివాళి

**దౌల్తాబాద్, అక్టోబర్ 30 ప్రజాస్వరం:**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు. హరీష్ రావు గారి తండ్రి సత్యనారాయణ రావు స్మారకార్థం స్థానిక ప్రజాప్రతినిధులు, యువనాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.దొమ్మట మాజీ సర్పంచ్ మోహనరావు, దౌల్తాబాద్ యువ నాయకుడు ఖాళీలుద్దీన్, జీర్కపల్లి, నరేష్, ఎనిశెట్టి మణికంఠ, సల్ల స్వామి తదితరులు కలిసి సత్యనారాయణ రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మోహనరావు మాట్లాడుతూసత్యనారాయణ రావు ప్రజాసేవలో నిబద్ధతతో, నిస్వార్థంగా పనిచేశారు. ఆయన చూపిన మార్గంలో హరీష్ రావు ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు అని తెలిపారు.వీరితోపాటు

యువ నాయకుడు ఖాళీలుద్దీన్ మాట్లాడుతూప్రజల పట్ల సానుభూతి చూపినసత్యనారాయణ రావు మన అందరికీ ఆదర్శం అని అన్నారు. జీర్కపల్లి నరేష్, మణికంఠ, స్వామి తదితరులు కూడా ఆయన సేవలను స్మరించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్

**శామీర్ పేట అక్టోబర్ 30(ప్రజాస్వరం)**

అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో గురువారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, హౌసింగ్ డిఈ అశోక్, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్ తో కలిసి ఇందిరమ్మ ఇండ్లును ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ కంఠం కృష్ణా రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు ఊరడి వెంకటేష్, భూమిరెడ్డి నవీన్ రెడ్డి, కొమ్ము వినోద్, బండి సతీష్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- **మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రష్ యాదవ్**
- **రహమత్ నగర్ డివిజన్ పరిధిలో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గం నాయకులు**

**శామీర్ పేట అక్టోబర్ 30(ప్రజాస్వరం)**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉపఎన్నిక నేపథ్యంలో గురువారం రహమత్ నగర్ డివిజన్ పరిధిలో గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రష్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటి సభ్యులు ముజీబుద్దీన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్, మల్లెపుల శ్రీకాంత్ యాదవ్, దమ్మాయిగూడా మున్సిపల్, అలియాబాద్ మున్సిపల్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, ముప్పు రామ రావు, తుంకి రమేష్, దోసకాయల వెంకటేష్, కీసర మండల మాజీ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్, రామిడి విజయ్ రెడ్డి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మజర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యూసఫ్, సంజీవ రెడ్డి, డివిజన్ నాయకులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..





# రైతన్నను ముంచిన మొంథా తుఫాన్

- **చేతికి వచ్చిన పంటలు నీళ్ల పాలు..**
- **మొక్కజొన్న కేంద్రాలు లేక రైతన్న అవస్థలు.**
- **చేతికి వచ్చిన పంట నేలపాలు..**
- **దిక్కుతోచని స్థితిలో అన్నదాత..**

**దౌల్తాబాద్ అక్టోబర్ 30 (ప్రజాస్వరం).**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో మొంతా తుఫాన్ రైతులను నిండా ముంచింది. వానాకాలంలో అధిక శాతం మంది రైతులు మొక్కజొన్న పంటను వేశారు. పంట చేతికి వస్తున్న సమయంలో తుపఫాన్ రావడంతో రైతులు మార్కెట్లో ఆరబోశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయిపోయింది. మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తుండడంతోరైతుల పరిస్థితి ఆగమ్య చెరగా మారింది. వర్షం కురవడంతో మొక్కజొన్నలు పూర్తిగా తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల వద్ద మొక్కజొన్నలు మొలకెత్తడంతో ధర పెట్టడం లేదని రైతులు వాపోతున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల వ్యాప్తంగా బుధవారం కురిసిన భారీ వర్షాలకు కోతకు వచ్చిన వరి వంగడంతో పంట నష్టం వాటిల్లింది. పత్తి చెల్లలో చేతికి వచ్చిన పత్తి నల్ల బరడంతో రైతుల కష్టం కన్నీళ్లను మిగిల్చింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు రైతులు వేసిన పంటలు దెబ్బ తినడంతో ఈ వానకాలం సాగు రైతులను బాధకు గురిచేస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం నిళ్లలో మునిగిపోవడం. మొక్కజొన్నలు తడిసిపోయి మొలకెత్తడం. పత్తి పంట ఎర్రబారడం తదితర పంటలు వర్షానికి దెబ్బ తినడంతో రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. అధికారులు స్పందించి జరిగిన పంట నష్టానికి వివరాలు సేకరించి జిల్లా అధికారులకు సమర్పించి తమకు న్యాయం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

# మొంథా తుఫాన్ తో నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

- పలు గ్రామాల్లో నీట మునిగిన వరి,పత్తి పంటలను పరిశీలించిన సిపిఐ,బిఆర్ఎస్ నాయకులు
- నిధులు మంజూరు చేసిన బ్రిడ్జిలు నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.
- వరదలో మృతి చెందిన పాడి ఆవుల రైతుకు 3లక్షలు పరిహారం ఇవ్వాలి.

**చిగురుమామిడి,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**




తుఫాన్ కారణంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని 17గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని,ప్రభుత్వం వెంటనే సర్వే చేసి బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు నేలకొరిగిన వరి పంటలను,పత్తి, మొక్కజొన్న పంటలను,దెబ్బ తిన్న రహదారులను,వరదలో కొట్టుకపోయి మృతి చెందిన పాడి పశువులను,వాగులు వంకలను పరిశీలించారు. అనంతరం సిపిఐ,బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రేకొండ గ్రామంలో గందె రాజేశ్వరి ,దుద్దేల లక్ష్మీనారాయణ,రొంటాల రాజయ్య, గుర్రాల మహేందర్ రెడ్డి ల పంట పొలాలను పరిశీలించినట్లు చెప్పారు.ఏరుకొండ రమేష్ కు చెందిన 4ఆవులు వాగులో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించినట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో నష్టపోయిన రైతుల పంట వివరాలు సర్వే చేసి బాధిత రైతులను వెంటనే అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.నష్టపోయిన వరి పంటకు ఎకరాన 50వేలు,పత్తి పంటకు 40వేలు,మొక్కజొన్న పంటకు 30వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రేకొండ నుండి ఎక్లాస్ పూర్ వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మించేందుకు మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్ 2కోట్ల 27లక్షలు మంజూరు చేస్తే 2సంవత్సరాలు అవుతున్న అతి గతి లేదని మండిపడ్డారు.రేకొండ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయిందని ప్రజలను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య,సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య,రైతు సంఘం మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మామిడి రాజేశ్వరి,అల్లెపు సంపత్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పైడిపల్లి వెంకటేష్,బోయిని పటేల్, మొగిలి ఓదెలు,విలాసాగరం అంజయ్య,తమ్మిశెట్టి రవీందర్, మాజీ ఎంపిటిసి పరకాల కొండయ్య తదితరులు ఉన్నారు.



## సాయుధ దళ పోలీసులలో క్రమశిక్షణ, భద్రతా ప్రమాణాలు ఆదర్శంగా నిలవాలి

- ఎస్పీ రావుల గిరిధర్.

**వనపర్తి,అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో గురువారం వార్షిక ఆయుధాల తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్ డిజిపి కార్యాలయం నుండి డీఎస్పీ శ్రీనివాసులు నాయకత్వంలో వచ్చిన తనిఖీ బృందం ఆయుధాలను, రికార్డులను సమగ్రంగా పరిశీలించింది. ఆయుధాల సంరక్షణ, భద్రతా ప్రమాణాలు, రికార్డు నిర్వహణ, వినియోగ విధానాలపై బృందం క్షుణ్ణంగా తనిఖీ జరిపి సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ "ఆయుధాల భద్రత పట్ల ప్రతి సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆయుధాల సంరక్షణ, వినియోగం విషయంలో చట్టపరమైన నిబంధనలు, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి. ప్రతి సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాభావంతో విధులు నిర్వహించడం ద్వారా పోలీసుశాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది" అన్నారు. సాయుధ దళం అనేది పోలీసు వ్యవస్థకు బలమైన వెన్నెముక లాంటిదని ప్రతి సిబ్బంది ఏకత్వం నిబద్ధతతో పనిచేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఆయుధాల వినియోగంపై నిరంతర శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సిబ్బంది ప్రావీణ్యం మరింత మెరుగవుతుందని తెలిపారు. తనిఖీ బృందం వనపర్తి సాయుధ దళ పోలీసుల పనితీరు, ఆయుధాల సంరక్షణ విధానాలపై సంతృప్తి వ్యక్తం చేయడం గర్వకారణమని, ఈ క్రమశిక్షణ, నిబద్ధత కొనసాగించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి,ఆయుధాల తనిఖీ బృందం అధికారి ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు,శ్రీనివాస్,ఏఆర్ ఎస్సై రహమాన్,హెడ్ కానిస్టేబుళ్లు వెంకటప్పారావు,అరవింద్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

**నాచారం,అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**

పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ మల్కాజ్గిరి డీసీపీ పద్మజ ఆధ్వర్యంలో మల్లాపూర్ వీ.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ ఏసీపీ చక్రపాణి,సీఐ బాలస్వామి,ఎస్ఐ హీనా పాల్గొని రక్తదాతలను అభినందించారు. రక్తదాన శిబిరంలో ఘట్కేసర్ మైనార్టీ యువకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,నేతలు, వాలంటీర్లు,ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.





## పెద్దమండడిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం.

- సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి.

**పెద్దమందడి,అక్టోబర్ 30 (ప్రజాస్వరం)**



మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో రైతులకు ఏ సమస్య రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం పెద్దమందడి మండల కేంద్రంతో పాటు పామిరెడ్డిపల్లి క్లస్టర్లో కొనుగోలు కేంద్రం ప్రారంభించామని ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు కేంద్రాలకు తెచ్చి విక్రయించుకోవాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్,సీఈవోలు జగదీశ్వర్ రెడ్డి, సుధాకర్,మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఐ.సత్య రెడ్డి, నాయకులు మన్యపు రెడ్డి,నరేష్, రామ్ రెడ్డి,మన్యంకొండ యాదవ్, కొండా రవీందర్ రెడ్డి,సిద్దయ్య, శ్రీశైలం,నాగేంద్రరావు,ప్రవీణ్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిపథంలో 4వ వార్డ్

**వనపర్తి,అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**



ఎమ్మెల్యే మెఘా రెడ్డి చొరవతో అభివృద్ధిలో జిల్లా కేంద్రంలోని నాల్గొవ వార్డ్ ప్రగతి పథంలో పురోగతి సాధిస్తున్నదని సాధిస్తున్నదని నాల్గొవ వార్డ్ మాజి కౌన్సిలర్ పద్మ పరుశురాం అన్నారు. గురువారం వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పత్రికలకు వివరించారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో 4వ వార్డుకు మాత్రమే రూ.1 కోటి రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టగా, అదనంగా మరో రూ.50 లక్షల నిధులు ప్రత్యేకంగా కేటాయించారని తెలిపారు. నల్లచెరువు మినీ ట్యాంక్ బండ్‌పై ప్రజల ఆరోగ్యాభివృద్ధి కోసం రూ.30 లక్షలతో ఓపెన్ జిమ్, మరో రూ.20 లక్షలతో రెండో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అదే ప్రాంతంలో రూ.20 లక్షలతో ఆర్చ్ నిర్మాణం కూడా పూర్తయిందన్నారు. పట్టణంలోని పార్కులు, క్యాంటీన్ అభివృద్ధికి రూ.1-2 కోట్ల నిధులు ఖర్చు చేయనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు. నరసింగాయపల్లెలో రూ.85 లక్షలతో 5 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయిందని, శ్రీ శివాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అప్పాయిపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో రూ.4 కోట్లతో సీసీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు. పీజీ కళాశాల ప్రహరీ గోడ, సీసీ రోడ్డుకు రూ.95 లక్షల నిధులు కేటాయించారని వివరించారు. అసంపూర్తిగా ఉన్న స్టేడియంను వినియోగంలోకి తీసుకురావడమే కాకుండా, 300 పడకల మాతశిశు సంరక్షణ కేంద్రం నిర్మాణం కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు. అలాగే అప్పాయిపల్లి లో ఆర్టీఏ కార్యాలయ మంజూరు, బాలనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే దశలవారీగా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా హైదరాబాద్ రహదారి అభివృద్ధి సహా రూ.18.75 కోట్ల నిధులతో వనపర్తిని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని పద్మ పరుశురాం ప్రశంసించారు.

## రాట మహోత్సవ వేడుకకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కి ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ ఈవో

- నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు జరగనున్న మార్గశిర మాసోత్సవాలు

**విశాఖపట్నం,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**

బురుజుపేట, శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో లో వచ్చే నెలలో జరిగే మార్గశిర మాస మహోత్సవములు సందర్భంగా నవంబర్ ఒకటవ తేదీన జరిగే రాట మహోత్సవ వేడుకకు దక్షిణ నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కి ఆలయ ఈవో శోభారాణి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా నవంబర్ ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు ఈ వేడుక జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మునిపెన్నడూ లేని విధంగా అమ్మవారి మార్గశిర మాస మహోత్సవములో ఘనంగా జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి,తీర్థ ప్రసాదములు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఆనందకుమార్ ,ఈ ఈ రమణ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు ఖాయం

- రాష్ట్ర నాయకుడు శివ ప్రకాష్


**శంకర్‌పల్లి అక్టోబర్ 30 (ప్రజాస్వరం):**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ఘన విజయం సాధిస్తుందని రాష్ట్ర నాయకుడు శివ ప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మాగంటి సునీత కార్యాలయంలో ఆమెకు శివ ప్రకాష్ బొకే ఇచ్చి, మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శివప్రకాష్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఓటర్లు బిఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని, భారీ మెజార్టీతో మాగంటి సునీత గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాగంటి వాత్సల్యనాథ్, కళ్యాణ్, శరత్, రాజు, చిరంజీవి, కృష్ణ, సాయి ఉన్నారు.

## నూతన జంటకు డాక్టర్ కందుల ఆశీర్వాదం

**విశాఖపట్నం,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**



నూతన జంటకు దగ్గరుండి పెళ్లి చేసి వారికి తన ఆశీర్వాదాలు అందజేశారు విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు. బౌదర రోడ్డు రోడ్డు శివాలయంలో భీమ్ నగర్ కు చెందిన భరత్,సీతమ్మధార ప్రాంతానికి చెందిన ప్రీతి కర్నల్ జంట కు డాక్టర్ కందుల నాగరాజు దగ్గరుండి వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన జంటకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అలాగే సుఖసంతోషాలతో కలకాలం జీవించాలని ఆయన ఆశీర్వదించారు. 32వ వార్డు పరిధిలోని విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిధిలోగల ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహాయ సహకారాలతో మరిన్ని మంచి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు.ఒక ప్రజా ప్రతినిధి గానే కాకుండా సంఘ సేవకులుగా కూడా కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి సహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాలలో భాగంగానే ఈ నూతన జంటకు తన సమక్షంలో వివాహం జరిపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన, కందుల కృష్ణ,వరద శ్రీను,బాబుల్ శ్రీను,సిపిఐ బుజ్జి,అప్పారావు, జానకి,శ్రీదేవి,కోదండమ్మ, రమణమ్మ, రేణుక,కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## బోటు మునిగిన మత్స్యకారుడికి రూ. 30 లక్షల నష్టపరహారం తక్షణమే చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్

**విశాఖపట్నం,అక్టోబర్ 30(ప్రజాస్వరం):**

విశాఖ ఫిషింగ్ హార్బర్ సెంట్రల్ డాక్ ప్రాంతంలో మత్స్యకారుడు మేరుగ ధనరాజు బోటు తుఫాను అలలు దాటికి మునిగిపోవడం జరిగిందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆ మత్స్యకారుడికి రూ. 30 లక్షల నష్టపరహారం చెల్లించాలని వైసీపీ నాయకులు, మాజీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకారుడుని పరామర్శించిన వాసుపల్లి గణేష్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఎవరికి ఎటువంటి కష్టం వచ్చిన ,నష్టం వచ్చిన అప్పటి ప్రభుత్వం ముందుండి తక్షణ సహాయక చర్యలు చేపట్టి వారిని ఆదుకోవడం జరిగేదని అన్నారు. గతంలో ఇక్కడ ఒక బోటు కాలిపోతే అప్పటికప్పుడే వైసిపి ప్రభుత్వం రూ.36 లక్షల ను ఆ మత్స్యకారుడుకి అందించడం జరిగిందని వెల్లడించారు. వైసిపి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వాన్ని స్పష్టం చేశారు. నేడు కూటమి ప్రభుత్వం వలన ఎవరికి ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని అన్నారు. ప్రజలను గాలికి వదిలేసి ఈ ప్రభుత్వం దుష్ట పాలన చేస్తుందని ఆరోపించారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడంలేదని విమర్శించారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాగ్దానాలు పేపర్ల వరకు పరిమితం అని అవి వాస్తవ రూపంలో అమలు జరగడంలేదని తెలియజేశారు. ఫిషింగ్ హార్బర్ లో మునిగిపోయిన బోటుకు నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. ఒట్టి మాటలతో ప్రజలను మోసగించకుండా వారికిప్రభుత్వంఅండగాఉండాలనితెలిపారు. మునిగిపోయిన బోటుకి తక్షణమే ప్రభుత్వం రూ.30 లక్షలను నష్ట పరిహారం చెల్లించాలని వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు.




# కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి



రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడిరచే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం





# నా నటనకు రిటైర్మెంట్ లేదు

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు.ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలా సార్లు వాయిదా పడిరది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.

# నేడు బాహుబలి ది ఎపిక్ విడుదల

**బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ**

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్'లో అవంతిక లవ్ స్టోరీ, కొన్ని పాటలు, కొన్ని సన్నివేశాలు కటింగ్‌లో తొలగించాం. కథాంశాన్ని మరింత సూటిగా చూపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం అని తెలిపారు. అలాగే, అందరూ బాహుబలి 3 వస్తుందని అనుకుంటున్నారని ప్రస్తావిస్తూ, అది కాదు అని స్పష్టంచేశారు. కానీ, ఒక స్పెషల్ సర్ప్రైజ్‌ను మాత్రం కన్ఫర్మ్ చేశారు. రాజమౌళి వెల్లడిరచిన ప్రకారం, బాహుబలి ఎపిక్ వెర్షన్ ఇంటర్వెల్‌లో 3డి యానిమేషన్ టీజర్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ టీజర్ ద్వారా బాహుబలి యూనివర్స్ కొనసాగనుందని చెప్పారు. ఈ యానిమేషన్ సీక్వెన్స్ దర్శకుడు ఇషాన్ శుక్లా రూపొందించినట్లు ఆయన వెల్లడిరచారు.




# మార్చి 19న లాక్ చేసిన టాక్సిక్

'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు




అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించను న్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999